
తెగిన పీఏబీఆర్ కుడికాలువ

నీట మునిగిన పంట పొలాలు

కొట్టుకుపోయిన విద్యుత్ మోటార్లు

మిడ్ పెన్నార్ డ్యాంకు నీటి మళ్లింపు



యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన మంత్రి కేశవ్

తుంగభద్ర ఎగువ కాలువకు గండి

- నీటి మట్టం తగ్గించి యుద్ధప్రాతిపదికన పూడ్చివేత

7

నీటికుంటలో పడి అన్నదమ్ముల మృతి

- అన్నను కాపాడేందుకు వెళ్లి తమ్ముడు..
- కళ్యాణదుర్గంలో విషాదం

7



కొండెక్కిన కోడి..!

అమాంతం పెరిగిన చికెన్ ధరలు

నెలలోనే రూ.50 పెరుగుదల

చికెన్ ప్రియుల జేబులకు చిల్లు

తాడిపత్రి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోడి కొండెక్కింది. చికెన్ ధరలు అమాంతం పెరిగాయి. గత నెలతో పోలిస్తే ప్రస్తుతం కిలోపై రూ.50 పెరిగింది. సామాన్యులు చికెన్ తినాలంటే భారంగా కనిపిస్తోంది. కార్తీకమాసంలో చికెన్ ధరలు భారీగా తగ్గాయి. కార్తీకం అలా ముగిసిందో లేదో.. ధరలు పెరగడం మొదలెట్టాయి. వారం వారం 10నుంచి 20 రూపాయలు పెంచుతున్నారు. గత నెలలో కిలో చికెన్ ధర రూ.190 నుంచి రూ.220 పలుకగా.. ప్రస్తుతం రూ.240 నుంచి రూ.270 పలుకుతోంది. కిలోపై రూ.50 మేర పెరిగిందన్న మాట. దీనికి కారణం కోళ్ల రేటు భారీగా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో కోళ్ల జిల్లాలోనే అందుబాటులో ఉండేవని దీంతో ధరలు తక్కువగా ఉండేవంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో లేక కర్ణాటక నుంచి తెచ్చుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. రవాణా చార్జీలు తడిసి మోపెడవుతుండడంతో చికెట్ రేటు పెరిగిందని విశ్లేషిస్తున్నారు. గతంలో నెలకు 10నుంచి 15టన్నులు విక్రయాలు సాగే.. చికెన్ ప్రస్తుతం 20నుంచి 30టన్నులు అమ్ముడవుతోంది. వారంపదిరోజుల్లోనే అమాంతం ఎలా పెరుగుతుందని మాంసంప్రియులు వాపోతున్నారు. రేట్లు ఇష్టారాజ్యంగా పెంచుతున్నా.. కట్టడి చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వారంలోనే భారీగా పెంపు



సామాన్యులు చికెన్ కొనాలంటే ఇబ్బందికరంగా ఉంది. వారంలోపే కేజీపై రూ.50 పెరగడంతో చికెన్ తినాలంటే ఆలోచించాల్సి వస్తోంది. తక్కువగా కొనుగోలు చేస్తున్నాం.

-ఓబులేసు, తాడిపత్రి

కోళ్ల రేటు పెరిగింది



గత వారంతో పోలిస్తే కోళ్ల రేటు అమాంతం పెరగడంతో చికెన్ ధరలు పెంచాల్సి వస్తోంది. లైవ్ కోడి కిలో గతంలో రూ.90 నుంచి రూ.100 ఉండేది. ప్రస్తుతం రూ.120 నుంచి రూ.130 వరకు పలుకుతోంది. అందుకు అనుగుణంగా చికెన్ ధరను పెంచాల్సి వస్తోంది.

-మహమ్మద్, చికెన్ సెంటర్ యజమాని

గిట్టుబాటు!

కొత్త పంటలతో అన్నదాతకు లాభాలు

- చియా, క్యారెట్, బీన్స్ సాగుతో ఎన్నో ప్రయోజనాలు
- పెట్టుబడులు తక్కువ.. ఆదాయం ఎక్కువ..



మామిళ్ళకుంటపల్లిలో సాగుచేసిన క్యారెట్ పంట

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతన్నలు ప్రత్యామ్నాయ పంటలవైపు ఆసక్తి చూపుతున్నారు. మొక్కజొన్న, వేరుశనగ పంటల దిగుబడి బాగా వచ్చినా. గిట్టుబాటు ధరల్లేక రైతులు నష్టాలబాట పడుతున్నారు. ఈ తరుణంలో ఓబుళదేవరచెరువు, అమడగూరు, నల్లమాడ మండలాల్లో వేలాది ఎకరాల్లో చియా, క్యారెట్, బీన్స్, పొద్దుతిరుగుడు పంటల సాగుకు మక్కువ చూపుతున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో ఎక్కువగా పండించే మొక్కజొన్న, వేరుశనగ సాగు విస్తీర్ణం క్రమేణా తగ్గుతూ వస్తోంది. ఇందుకు ప్రధాన కారణాలు గిట్టుబాటు ధర లేకపోవడం, పంటల సాగుకు ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సి వస్తుండడం.

తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభాలు

నల్లమాడ, అమడుగూరు, ఓబుళదేవరచెరువు మండలాల్లో రైతులు తక్కువ పెట్టుబడి అయ్యే చియా పంటపై ఆసక్తి చూపుతున్నారు. దున్నడం, కలుపుతీత, సేంద్రియ ఎరువులతో 90 రోజుల్లో పంట చేతి కొస్తుంది. దిగుబడి కూడా ఎకరాకి 6 నుంచి 7 క్వింటాళ్ల వరకు వస్తుందని (మిగతా 7లో..)



ర్యాలీలో పాల్గొన్న మాజీ సైనికులు, విద్యార్థులు

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి

- కలెక్టర్ ఆనంద్
- ఘనంగా సాయుధ దళాల పతాక దినోత్సవాలు ప్రారంభం



సాయుధ దళాల పతాక నిధికి విరాళం అందజేస్తున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సాయుధ దళాల పతాక దిన్సోతవాలను కలెక్టర్ ఆదివారం ప్రారంభించారు. కలెక్టర్ సాయుధ దళాల పతాక నిధికి తనవంతు విరాళాన్ని అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ... అందరి సహకారంతో ఈ ఏడాది వీలైనంత అధిక మొత్తంలో సాయుధ దళాల పతాక నిధి విరాళాలను సేకరించాలన్నారు. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నావికాదళం సాయుధ దళాల పతాక నిధికి విరివిగా విరాళాలు అందించాలన్నారు. జిల్లాలో అర్హులైన మాజీ సైనికులు, అమరులైన సైనిక కుటుంబాలకు భూ పంపిణీ కోసం చర్యలు చేపట్టామన్నారు. అంతకుముందు ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప ఆధ్వర్యంలో సాయుధ దళాల పతాక దినోత్సవ ర్యాలీని నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి క్లాక్‌టవర్ వరకూ నిర్వహించి, విరాళాలను సేకరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, సిబ్బంది మాజీ సైనికుల సంఘం నాయకుడు విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం: ఎస్పీ



సైకిల్ ర్యాలీలో ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దామని జిల్లా ఎస్పీ జగదీష్ పిలుపునిచ్చారు. నగరంలో ఆదివారం 'డ్రగ్స్ వద్దు బ్రో-సైకిల్ తొక్కు బ్రో' పేరుతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్పీ స్వయంగా సైకిల్ తొక్కుతూ ర్యాలీలో ముందుకు సాగారు. ఎస్పీ కార్యాలయంలో ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్ సర్కిల్, సప్తగిరి సర్కిల్, సుభాష్ రోడ్డు, క్లాక్‌టవర్, ఎన్టీఆర్ సర్కిల్, శ్రీకంఠం సర్కిల్, పాతూరు, గాంధీబజార్ మీదుగా కలెక్టరేట్ వరకూ నిర్వహించారు. పోలీసులు, క్రీడాకారులు, ఎన్జీఓలు పెద్దఎత్తున సైకిళ్లు తొక్కుతూ ఉత్సాహంగా ముందుకు కదిలారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ... డ్రగ్స్ యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయన్నారు. మరణం వరకూ తీసుకెళ్తున్నాయన్నారు. స్నేహితులు, సహచరులు అడిగారని, ఒత్తిడి నుంచీ బయటకు రావాలని డ్రగ్స్‌కు అలవాటుపడితే... క్రమంగా బానిసలుగా మారుతారన్నారు. సైకిల్ తొక్కడంతో ఫిట్‌గా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఇలియాజ్‌బాషా, డీఎస్పీలు శ్రీనివాసరావు, మహబూబ్ బాషా, సూర్యనారాయణరెడ్డి, నీలకంటేశ్వర్ రెడ్డి, డిస్కవర్ అనిల్, సీఐలు పాల్గొన్నారు.

ఏఈఆర్‌ఓలకు షోకాజ్ నోటీసులు

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా మ్యాపింగ్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎనిమిది మంది ఏఈఆర్‌ఓలకు కలెక్టర్, ఎన్నికల అధికారి ఆనంద్ ఆదివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2025లో భాగంగా 2002 ఓటరు జాబితాకు సంబంధించి ప్రస్తుతమున్న ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియ చేపడుతున్నారు. అందులో భాగంగా ప్రతిరోజు ఓటరు జాబితా మ్యాపింగ్ అంశంపై డీఆర్‌ఓ, జిల్లా ఉప ఎన్నికల అధికారి టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. అందరూ ఈఆర్‌ఓలు 30 శాతం పూర్తి చేయగా, అనంతపురం అర్బన్, రాప్తాడు పరిధిలో కేవలం 26.45 శాతం మాత్రమే పూర్తయినట్లు తేలింది. ఇందుకు సంబంధించి ఏఈఆర్‌ఓలుగా ఉన్న అనంతపురం రూరల్, రాప్తాడు ఎంపీడీఓలకు, అనంతపురం రూరల్, చెన్నేకొత్తపల్లి, ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి, రాప్తాడు తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 15వ తేదీలోపు సంజాయిషీ ఇవ్వాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి హెచ్చరించారు.

ఎస్టీయూ కమిటీ ఎన్నిక





రమణారెడ్డి, రామాంజనేయులు

అనంతపురం విద్య, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ జిల్లా కమిటీ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్రనాయకుడు గోకారి నాగరాజు వ్యవహరించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులును రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా మల్లికార్జున, జిల్లా గౌరవాధ్యక్షుడిగా రాజశేఖర్‌తోపాటు 20 మంది జిల్లా కార్యవర్గసభ్యులను, 17 మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి ఎస్టీయూ కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

ముగిసిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలు

అనంతపురం విద్య, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పోటీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయని డీఈఓ ప్రసాద్ బాబు, ఏసీ వెంకటేశులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 15 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించామన్నారు. మొత్తం 3,354 విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. పరీక్షలకు 3,205 మంది హాజరయ్యారన్నారు.

వైసీపీ, టీడీపీ వర్గీయుల ఘర్షణ

- టీడీపీ వర్గీయులకు గాయాలు
- వైసీపీకి బీజేపీ అండ



రాయదుర్గం ఆసుపత్రిలో గాయపడ్డ టీడీపీ వర్గీయులను పరామర్శిస్తున్న కన్వీనర్ కాలవ సన్నన్న

గుమ్మఘట్ట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రంపల్లిలో ఆదివారం చోటుచేసుకున్న రస్తా వివాదంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల ఘర్షణ పడ్డారు. ముగ్గురు టీడీపీ వర్గీయులు గాయపడి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన వైసీపీ వర్గీయులు పురుషోత్తంరెడ్డి మద్దతుదారులు టీడీపీ వర్గీయులైన శివానంద, వినోదమ్మ, సునందమ్మ మద్దతుదారులపై మారణాయుధాలు, కట్టెలతో దాడి చేశారు. దీంతో వారి ముగ్గురికి తీవ్ర గాయాలై రాయదుర్గం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారిని ఆదివారం మధ్యాహ్నం టీడీపీ మండల కన్వీనర్ కాలవ సన్నన్న, మాజీ కన్వీనర్ గిరిమల్లప్ప పరామర్శించారు. ఇరువర్గాల ఘర్షణపై గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

వైసీపీకి బీజేపీ నాయకుల మద్దతు



ఆసుపత్రిలో వైసీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తలకు బీజేపీ అండగా నిలవడం విడ్డూరంగా కనిపిస్తోంది. వైసీపీ నాయకులకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి అండగా నిలుస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది. గుమ్మఘట్ట మండలం యర్రంపల్లిలో రస్తా వివాదంలో ఆసుపత్రిలో చేరిన వైసీపీ కార్యకర్త పురుషోత్తంరెడ్డిని ఆదివారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పరామర్శించి అండగా ఉంటానంటూ భరోసా ఇచ్చారు. ఆయన ఆసుపత్రి నుంచి వెళ్లిన అరగంటలోనే వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తనయుడు విశ్వనాథ్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి పురుషోత్తంరెడ్డిని పరామర్శించారు. ఈ సంఘటన పట్ల టీడీపీ వర్గీయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమిలో భాగంగా ఉన్న బీజేపీ.. రాయదుర్గం నియోజకవర్గంలో మాత్రం వైసీపీకి అండగా ఉంటూ టీడీపీకి వ్యతిరేకంగా పనిచేయడం పట్ల భవిష్యత్‌లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనని చర్చించుకుంటున్నారు.

చైర్మన్ గిరి కోసం వైసీపీ అడ్డదారులు

ఆ పార్టీ ఆధీనంలో ఓ కౌన్సిలర్..?

కౌన్సిలర్లకు ముఖ్యనాయకులతో ఫోన్లు

వేగంగా మారుతున్న సమీకరణలు

టీడీపీలో గెలుపు ధీమా



కళ్యాణదుర్గం మున్సిపల్ కార్యాలయం

కళ్యాణదుర్గం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ కుర్చీని దక్కించుకునేందుకు వైసీపీ అడ్డదారులను ఎంచుకుంది. ఈ నెల 11న మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరగనుంది. దీంతో రోజురోజుకు పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. టీడీపీ విజయం ఖాయం అన్న ధీమా ఆ పార్టీ శిబిరంలో కనిపిస్తోంది. దీనిని పసిగట్టిన వైసీపీ నాయకులు టీడీపీకి మద్దతిచ్చే వారిపై ఓ కన్నేసి ఉంచారు. టీడీపీకి మద్దతిస్తారన్న భయంతో ఓ కౌన్సిలర్ ఆచూకీ దొరకకుండా చేసినట్లు తెలుస్తోంది. ఆ కౌన్సిలర్‌ను తమ ఆధీనంలో ఉంచుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య తన ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. ఎలాగైనా మున్సిపల్ చైర్మన్ కుర్చీని దక్కించుకోవాలన్న ఉద్దేశ్యంతో వైసీపీ అడ్డదారుల్లో వెళ్తోంది. టీడీపీకి మద్దతు ఇచ్చేవారి కదలికలపై నిఘా ఉంచారు. గతంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన కౌన్సిలర్లపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. వైసీపీ ముఖ్యనాయకులతో కూడా ప్రత్యేకంగా ఫోన్లు చేయించి, మద్దతు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. వైసీపీలో ఓటమి భయం పట్టుకున్నట్లు కనిపిస్తోంది. సంఖ్యాబలం సమానంగా ఉండడంతో ఒకరిద్దరు కీలకంగా మారారు. వారి నిర్ణయంపైనే చైర్మన్ గెలుపు ఆధారపడి ఉంటుంది. దీంతో ఎలాగైనా చైర్మన్ స్థానాన్ని సాధించుకోవాలన్న ఉద్దేశ్యంతో అడ్డదారుల్లో వైసీపీ ముందుకు సాగుతోంది.

విజయంపై టీడీపీ ధీమా

కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని టీడీపీ ధీమాతో ఉంది. మున్సిపాలిటీలో మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో 13 మంది వైసీపీ వర్గీయులు, 11 మంది టీడీపీ వర్గీయులు ఉన్నారు. ఎక్స్ అఫిషియో హోదాలో ఎమ్మెల్యే, ఎంపీకి మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో పాల్గొని ఓటు వేసే హక్కు ఉంది. దీంతో టీడీపీ బలం 13కు పెరుగుతుంది. దీంతో ఇరుపార్టీలకు సమానమైన బలాబలాలు ఉన్నాయి. కేవలం ఒక్కరు మద్దతు ఇస్తే చాలు చైర్మన్ పీఠం అధికార పార్టీ దక్కించుకునే అవకాశం ఉంది. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి వైసీపీ కౌన్సిలర్లు మద్దతు పలుకుతారని టీడీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

తుంగభద్ర గేట్ల మార్పు ప్రారంభం

బొమ్మనహాళ్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఆనకట్టలో పాత క్రస్ట్‌గేట్లను పూర్తిగా తొలగించి నూతన గేట్లను ఏర్పాటు చేసే కార్యక్రమం ఆదివారం ప్రారంభమయింది. 18వ గేటు ఒక భాగాన్ని గ్యాస్ కట్టర్‌తో కత్తిరించి భారీ క్రేన్ సహాయంతో పైకి ఎత్తి తొలగించింది. దీంతో గేట్ల మార్పు పనులు వేగవంతంగా ప్రారంభమైనట్లు స్పష్టత వచ్చింది. ప్రస్తుతం తుంగభద్ర డ్యాంలో నీటి మట్టం 1621.46 అడుగులు ఉండగా 18వ గేటు నీటి మట్టానికి 10 అడుగులకు పైగా ఎత్తులో ఉండటంతో పని సజావుగా సాగింది. ఆనకట్ట మధ్యలో క్లియరెన్స్ పనులు ముమ్మరంగా జరుగుతుండగా.. ఎడమ, కుడి వైపు గేట్లను కూడా దశలవారీగా కత్తిరించి తొలగించే ప్రణాళికను తుంగభద్ర బోర్డు రూపొందించింది. డిసెంబర్ మూడో వారం నాటికి కొంత భాగం పూర్తిగా క్లియర్ చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 65.52 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాలువల ద్వారా రోజుకు 9,194 క్యూసెక్కుల నీరు విడుదల చేయడంతో రోజుకు దాదాపు ఒక టీఎంసీ నీరు తగ్గిపోతోంది. ఇదే రీతిలో కొనసాగితే జలాశయం 43 టీఎంసీ స్థాయికి చేరి బెడ్ కాంక్రీట్‌ను తాకేందుకు సుమారు 20 రోజులు పడుతుందని అధికారులు అంటున్నారు. రాబోయే రోజుల్లో గేట్ల తొలగింపు కాంక్రీట్ పనులు, కొత్తగేట్ల అమర్చే ప్రక్రియ మరింత వేగం పుంజుకునే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.



క్రేన్‌తో పనులు చేస్తున్న దృశ్యం

నీటికుంటలో పడి అన్నదమ్ముల మృతి

అన్నను కాపాడేందుకు వెళ్లి తమ్ముడు..

కళ్యాణదుర్గంలో విషాదం



నీటి కుంట



నరేంద్ర (ఫైల్)



చరణ్ (ఫైల్)

బ్రహ్మసముద్రం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నీటి కుంటలో పడి అన్నదమ్ములు మృతి చెందిన సంఘటన బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన తలారి వెంకటేశులు అనే వ్యక్తి పాలవెంకటాపురం గ్రామానికి రైతు అమర శేషు మామిడితోటను కౌలుకు తీసుకున్నాడు. ఆదివారం ఉదయం మామిడి తోటకు మందును పిచికారి చేసేందుకు కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన తలారి నరేంద్ర (35), తలారి చరణ్ (26) ఇద్దరు అన్నదమ్ములు కలిసి తోటలోకి వచ్చారు. కాసేపు పిచికారి చేసిన తర్వాత దాహం వేయడంతో నీళ్ల తాగేందుకు ఆ పొలంలో ఏర్పాటు చేసిన నీటి కుంట దగ్గరికి ఇద్దరూ కలిసి వెళ్లారు. మొదట అన్న తలారి నరేంద్ర వెళ్లాడు. నీళ్ల తాగేందుకు కుంటలోకి దిగాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కుంటలో పడిపోయాడు. అన్నను కాపాడే ప్రయత్నంలో తమ్ముడు తలారి చరణ్ వెంటనే నీటిలోకి దిగాడు. ఇద్దరికి ఈత రాకపోవడంతో నీటి లోనే మునిగిపోయారు. అన్నను కాపాడే ప్రయత్నంలో తమ్ముడు కూడా మునిగిపోయాడు. ఇద్దరూ ఎంత సేపటికి రాకపోవడంతో తోటి కూలీలు గమనించి నీటికుంట దగ్గరికి వెళ్లారు. నీటికుంటలోకి వెళ్లి చూడగా.. అప్పటికే ఆ ఇద్దరు అన్నదమ్ములు మృతి చెంది నీటిలో తేలాడుతున్నారు. తోటి కూలీలు ఆ దృశ్యాన్ని చూసి విలపించారు. గ్రామస్థులకు సమాచారం అందించడంతో వచ్చి మృతదేహాలను బయటకు తీసారు. ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోవడంతో కళ్యాణదుర్గం పట్టణం, పాలవెంకటాపురంలో విషాదం నెలకొంది. అన్నదమ్ములను కోల్పోయిన కుటుంబం తీరని దుఃఖంతో శోక సంద్రంలో మునిగిపోయింది. తలారి నరేంద్రకు ఇటీవల పెళ్లి అయింది. అతడి భార్య గర్భవతిగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టరు బోల్తా పడి యువకుడు..



యంజారప్ప (ఫైల్)

మడకశిర రూరల్/గుడిబండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోతులగుట్ట గ్రామ సమీపంలో ట్రాక్టర్ బోల్తాపడి యంజారప్ప (31) అనే యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. ఎస్ఐ లావణ్య తెలిపిన మేరకు.. గుడిబండ మండలం సీసీగిరి గ్రామానికి చెందిన బండిమనే తిమ్మప్ప కుమారుడు యంజారప్పకు కోతులగుట్ట గ్రామంలో వివాహమైంది. ఇతడు బెంగళూరులోని ఫార్మా కంపెనీలో మెడికల్ రెప్‌గా పనిచేస్తున్నాడు. భక్తరహళ్లి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు కోతులగుట్ట గ్రామానికి వచ్చాడు. స్వామికి మొక్కులు తీర్చుకున్నాడు. ఆదివారం పొలం పనుల కోసం బావ మల్లికార్జునగౌడ్‌తో కలిసి వెళ్లాడు. తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువ మలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. మల్లికార్జునగౌడ్ పక్కకు దూకడంతో గాయాలతో బయటపడ్డాడు. ట్రాక్టర్ నడుపుతున్న యంజారప్ప ట్రాక్టర్ రొటోవేటర్ కింద పడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సీసీ గిరి గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య గాయిత్రి, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫోన్ మాట్లాడుతూ.. విద్యుత్ లైన్ తాకి..

బీటెక్ విద్యార్థికి తీవ్రగాయాలు

ధర్మవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారుతీనగర్‌లో బీటెక్ విద్యార్థి రాజవంశీకృష్ణ ఆదివారం సాయంత్రం మిద్దెపైన ఫోన్ మాట్లాడుకుంటూ వెళ్లి విద్యుత్ లైన్ తాకాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. టూటౌన్ పోలీసులు వివరాలిలా ఉన్నాయి. మారుతీనగర్‌కు చెందిన వెంకటస్వామి కుమారుడు రాజవంశీకృష్ణ అనంతపురంలోని ప్రైవేటు కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఆదివారం మిద్దెపైన ఫోన్‌లో మాట్లాడుకుంటూ వెళ్లి.. పైన ఉన్న విద్యుత్ వైర్లను తగిలి, కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన రాజవంశీకృష్ణను కుటుంబసభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

దూసుకెళ్లిన జీపు.. 40 గొర్రెలు మృతి



గొర్రెల కళేబరాలు

బెళుగుప్ప, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో నష్టపోయి ఐదు ఎకరాలు పొలం అమ్మి జీవాలతోనైనా గట్టెక్కుదామని జీవనం సాగిస్తున్న ఆ రైతన్నను విధి మరో రూపంలో కుంగదీసింది. మండలంలోని కాలువపల్లి వద్ద పెన్నా బ్రిడ్జిపై ఆదివారం తెల్లవారుజామున గొర్రెల మంద వెళుతుండగా.. కళ్యాణదుర్గం నుంచి అనంతపురం మార్కెట్‌కు ఆకుకూరలు తరలిస్తున్న తుఫాను జీప్ దూసుకెళ్లింది. ఆత్మకూరు మండలం యాలేరుకు చెందిన రైతు నాగేశ్వరరెడ్డి మండలంలోని కొనంపల్లికి మేత మేపడానికి 250 గొర్రెలతో వచ్చాడు. ఇక్కడి నుంచి స్వగ్రామానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. 40 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా మరో 20 గొర్రెలు గాయాలపాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివ కేసు నమోదు చేశారు. తమకు న్యాయం చేయాలంటూ కాపరి రోడ్డుపై ధర్నా చేశారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. తనను ప్రభుత్వం ఆదుకోవాలని గొర్రెల యజమాని నాగేశ్వరరెడ్డి కోరారు..

సివిల్స్ ఉచిత శిక్షణ పరీక్షకు 55 మంది హాజరు

అనంతపురం విద్య, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్‌లో ఆదివారం సివిల్స్ ఉచిత శిక్షణకు నిర్వహించిన పోటీ పరీక్షకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 55 మంది హాజరయ్యారు. 59 మంది దరఖాస్తు చేసుకోగా.. నలుగురు గైర్హాజరయ్యారు. బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారి, ఏబీసీ డబ్ల్యూఓ మస్తాన్ తదితరులు పరీక్షలను పర్యవేక్షించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీడీ తెలిపారు.

ముగిసిన ఎంపిక పోటీలు



వాలీబాల్ విజేత ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాల జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళల వాలీబాల్, టేబుల్‌టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఎస్కే యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ జెస్సీ, ఆర్గనైజింగ్ కమిటీ చైర్‌పర్సన్, ప్రిన్సిపాల్ పద్మశ్రీ పోటీలను ప్రారంభించారు. వాలీబాల్ విజేతగా అనంతపురం ఎస్ఎల్ఎన్ డిగ్రీ కాలేజీ జట్టు నిలవగా, మంగళకర డిగ్రీ కాలేజీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. టేబుల్‌టెన్నిస్ విజేతగా కదిరి ఎస్‌టీఎస్ఎన్ డిగ్రీ కాలేజీ జట్టు, రన్నరప్‌గా ఆర్ట్స్ కాలేజీ జట్టు నిలిచాయి. అనంతరం విజేత జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీడీలు శ్రీరామ్, నాగేష్ పాల్గొన్నారు.

తెగిన పీఏబీఆర్ కుడికాలువ


నీట మునిగిన పంట పొలాలు

కొట్టుకుపోయిన విద్యుత్ మోటార్లు

మిడ్ పెన్నార్ డ్యాంకు నీటి మళ్లింపు



చీనీ తోటలో ప్రవహిస్తున్న నీరు



తెగిన కుడికాలువ గట్టు

కూడేరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ డ్యాం కుడి కాలువ ఆదివారం అర్ధరాత్రి సమయంలో తెగిపోయింది. దీంతో నీరంతా పంట పొలాల్లోకి చేరడంతో భారీగా నష్టం వాటిల్లింది. కూడేరు మండలం జల్లిపల్లి సమీపంలోని 4.20 కిలో మీటర్ వద్ద గత ఏడాది దెబ్బతిన్న కాలువకు ఇసుక బస్తాలు ఏర్పాటు చేశారు. కాలువలో ఒక్కసారిగా నీరు పెద్ద ఎత్తున రావడంతో పూర్తిగా తెగిపోయింది. జల్లిపల్లి, ఉదిరిపికొండ, శివరాంపేట గ్రామాలకు చెందిన దాదాపు వంద ఎకరాలకు పైగా వరి, వేరుశనగ, కంది, చీనీ, మొక్కజొన్న పంటలు నీటి మునిగాయి. దీంతో లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కసారిగా 790 క్యూసెక్కుల నీరు రావడంతో ఇసుక బస్తాలు ఏర్పాటు చేసిన ప్రదేశంలో కాలువ తెగిపోయి, నీరంతా పంటల పొలాల్లోకి చేరింది. చేతికొచ్చిన వరి పంట నీటి పాలు కావడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేశారు. పంటతోపాటు తోటల్లో ఉన్న విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు, డ్రిప్ పరికరాలు నీటిలో కొట్టుకుపోవడంతో భారీగా నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ శాఖ అధికారులు అప్రమత్తమై డ్యాం సమీపంలోని 0.400 కిలో మీటర్ వద్దనున్న ఎస్కేప్ చానల్ ద్వారా నీటిని దిగువనున్న మిడ్ పెన్నార్ డ్యాంకు మళ్లించారు. ఎస్కేప్ చానల్ గేట్లను ఈఈ శశికళ, డీఈలు విశ్వనాథ్ రెడ్డి, కవిత, ఏఈలు సుబ్రహ్మణ్యం, ఓబులరెడ్డి సిబ్బంది కిందికి దించడానికి ఆపసోపాలు పడ్డారు. ఏఈఓలు దిలీఫ్, రాఘవేంద్ర మాట్లాడుతూ.. వంద ఎకరాలకు పైగా పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు.

వారం రోజుల్లో కోత చేయాలి



రెండు ఎకరాల్లో వరి సాగు చేశా. వారం రోజుల్లో వరి కోత చేయాలి. అంతలోనే కుడికాలువ నీరు నిండా ముంచింది. చేతికొచ్చిన పంట నీటి పాలయింది. వరి పంట మొత్తం కొట్టుకుపోవడంతోపాటు ఎకరాలో సాగుచేసిన చీనీ చెట్లు నీటిలో మునిగిపోయాయి. వ్యవసాయ పరికరాలు కొట్టుకుపోవడంతో దాదాపు రూ.2 లక్షల వరకు నష్టం వచ్చింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- వీరభద్ర, రైతు, ఉదిరిపికొండ

కళ్లముందే నీటిపాలు



కుడికాలువ తెగి నీరంతా వరి, చీనీ పంటల్లోకి పెద్ద ఎత్తున చేరింది. మూడు రోజుల్లో వరి పంట కోత చేయాలి. అంతలోనే రెండున్నర ఎకరాల వరి పంట కళ్ల ముందే నీటి పాలయింది. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నా. లక్షలు అప్పు చేసి వరి పంటతోపాటు చీనీ పంట సాగు చేస్తున్నా. కోత చేయాల్సిన పంటలు నీట మునగడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

- పోలా వెంకటేష్, రైతు, ఉదిరిపికొండ

తుంగభద్ర ఎగువ కాలువకు గండి

నీటి మట్టం తగ్గించి యుద్ధప్రాతిపదికన పూడ్చివేత



గండి పడడంతో వాగులోకి పోతున్న నీరు

బొమ్మనహాళ్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్ హెచ్చెల్సీ సెక్షన్ పరిధిలోని ఉంతకల్లు వద్ద ఎగువ కాలువకు ఆదివారం తెల్లవారుజామున గండి పడింది. 113/557 కిలో మీటర్ వద్ద కాలువ కుడి గట్టుకు గండి పడడంతో భారీగా నీరు వాగులోకి వెళ్లాయి. దీంతో ఉద్దేహాళ్ సమీపంలో ఉన్న అయకట్టులో సాగు చేసిన వరి పంట పొలంలోకి నీరు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గండి పడడంతో సుమారు 90 క్యూసెక్కుల నీరు బయటకు పోయాయి. ఉదయం 7 గంటలకు రైతులు గమనించి హెచ్చెల్సీ అధికారులకు సమాచారం అందించారు. కణేకల్లు సబ్‌డివిజన్ డీఈఈ దివాకర్‌రెడ్డి, సరిహద్దు డీఈఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఏఈఈలు ఆల్తాఫ్, రంజిత్ గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. నీటి మట్టాన్ని సరిహద్దులో తగ్గించి గండి పూడ్చేందుకు చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు గండిని పూర్తిగా మూసివేశారు. సరిహద్దులో ఎక్కువ స్థాయిలో నీరు రావడంతో ప్రమాదం జరిగిందని డీఈఈ దివాకర్ రెడ్డి తెలిపారు. సాగునీటి సంఘం అధ్యక్షుడు రాజేష్, నటరాజ్, టీడీపీ నాయకులు నల్లాపురం బాబు, నవీన్, సంగప్ప ఉన్నారు.

ప్రభుత్వ విప్ ఆరా

ఎగువ కాలువకు గండి పడిన విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హెచ్చెల్సీ అధికారులతో మాట్లాడారు. పంటలకు ఎలాంటి నష్టం జరగకుండా గండి పూడ్చివేత పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. సరిహద్దులో ఎక్కువ స్థాయిలో నీరు ఇండెంట్ రావడంతోనే ఈ పరిస్థితి ఎదురైందని అధికారులు విప్ దృష్టికి తీసుకెళ్లారు.

యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన మంత్రి కేశవ్



అనంతపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కూడేరు మండలం జల్లిపల్లి సమీపంలోని పీఏబీఆర్ కుడికాలువకు గండి పడిందన్న సమాచారం నేపథ్యంలో... రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తక్షణం స్పందించారు. ఆ మేరకు అధికారులను అప్రమత్తం చేశారు. మంత్రి ఆదేశాలతో యంత్రాంగం కదిలింది. గండిని పూడ్చేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. జల్లిపల్లి సమీపంలో పీఏబీఆర్ కుడికాలువకు ఆదివారం తెల్లవారుజామున గండిపడినట్లు గుర్తించారు. వెంటనే ఆ సమాచారం అందున్న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గండిని పూడ్చేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గండి పడిన ప్రాంతం వద్ద ఇసుక బస్తాలు ఏర్పాటు చేసి నిలువరించే ప్రయత్నం చేయాలన్నారు. నీరు వృథాగా పోకుండా తగిన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. మంత్రి ఆదేశాలు అందుకున్న అధికారులు నీరు వృథా కాకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. దీంతో ఆ ప్రాంత రైతులు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

ముందే చెప్పిన ఆంధ్రజ్యోతి

కాలువ గట్లు దెబ్బతిన్నా పట్టించుకోని యంత్రాంగం



తెగిన ప్రదేశంలో వేసిన ఇసుక బస్తాలు (ఫైల్)



ఇది రైటేనా..?

పీఏబీఆర్ కుడికాలువపై నిర్లక్ష్యం

ధర చెప్పకపోతే ఒప్పుకోం

ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనం

కూడేరు(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ డ్యాం కుడికాలువ గట్లు దెబ్బతిన్నాయని ఆంధ్రజ్యోతి దిన పత్రిక ముందే హెచ్చరించి నా.. ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోలేదు. పీఏబీఆర్ డ్యాం నుంచి 114 కిలో మీటర్ల దూరం ఉన్న కుడి కాలువ ద్వారా 48 చెరువులకు నీటిని సరఫరా చేస్తారు. డ్యాం నుంచి 25వ కిలోమీటర్ వరకు కాలువ దెబ్బతిని నీరంతా వృథాగా బయటకు వెళుతోంది. దీనిపై అక్టోబరు 7వ తేదీ ఆంధ్రజ్యోతిలో 'ఇది రైటేనా' అనే శీర్షికతో కథనం ప్రచురితమయింది. 25వ కిలోమీటర్ వరకు రూ. 8 లక్షలు మాత్రమే నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకున్నారు. కాలువకు నీరు వదిలితే పెద్ద ఎత్తున వృథా అయ్యే ప్రదేశం ఉందని చెప్పినా పట్టించుకోనే నాథునే కరువయ్యారు. డ్యాం సమీపంలోని 4. 5 కిలోమీటర్ మధ్యలో ఇసుక బస్తాలతో కాలువ గట్లకు ఏర్పాటు చేశారు. ఇదే అంశాన్ని ప్రస్తావించినా అధికారులు కళ్లు తెరవకపోవడంతో ఆదివారం అర్ధరాత్రి ఆ ప్రదేశంలోనే కాలువ తెగిపోయింది. దీంతో నీరంతా పంట పొలాల్లోకి చేరడంతో భారీగా నష్టం వాటిల్లింది. నీట మునిగిన పంటలను చూసిన అన్నదాతలు గుండెలు బాదుకుంటున్నారు.

హెచ్చెల్సీ రంధ్రం మూసివేత



రంధ్రాన్ని మూసివేస్తున్న హెచ్చెల్సీ అధికారులు

కణేకల్లు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళేకుర్తి వద్ద హెచ్చెల్సీ ప్రధాన కాలువపై పడ్డ రంధ్రాన్ని హెచ్చెల్సీ అధికారులు ఆదివారం పూడ్చివేశారు. హెచ్చెల్సీ అక్విడెక్ట్ నుంచి కళేకుర్తికు వెళ్లు దారిలో ఆదివారం ఉదయం రంధ్రం పడగా దాన్ని గుర్తించిన హెచ్చెల్సీ డీఈ దివాకర్‌రెడ్డి, ఏఈ నరేంద్రమారుతి, చెరువు సంఘం అధ్యక్షుడు బీటీ రమేష్ అప్రమత్తమై ఎక్స్‌కవేటర్ సాయంతో మట్టివేసి పూడ్చివేశారు. అలాగే 159 కి.మీ. వద్ద కోతకు గురైన హెచ్చెల్సీ కాలువకు ఇసుక బస్తాలు అడ్డువేశారు.

ప్రొఫెసర్ దయానంద్‌కు పీఎం ప్రొఫెసర్‌షిప్



అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ విశ్వవిద్యాలయంలో మాలిక్యులర్ మైక్రోబయాలజీ ప్రయోగశాలను స్థాపించిన ప్రొఫెసర్ దయానంద్ సిద్ధవటంకు ప్రధానమంత్రి ప్రొఫెసర్‌షిప్ వరించింది. త్వరలో యోగి వేమన యూనివర్సిటీలో నిర్వహించనున్న ప్రధానమంత్రి ప్రొఫెసర్‌షిప్‌కు ఆయన ఎంపికయ్యారు. ఆయన గతంలో ఎస్కేయూలో మాలిక్యులర్ మైక్రోబయాజీలో ఎన్నో పరిశోధనలు చేశారు. 2007లో హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో జంతు జీవశాస్త్ర విభాగం ఆఫ్‌లైన్ సైన్సెస్‌లో ప్రొఫెసర్‌గా చేరారు. బయోటెక్, ఫార్మాసూటికల్ కంపెనీలతో కలిసి పనిచేశారు. ఆయన పరిశోధనలకు నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఇండియా, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్(బెంగళూరు), ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ(న్యూఢిల్లీ) ఫెలోషిప్‌లు దక్కాయి. ఆయన చేసిన పరిశోధనలకుగానూ ప్రధానమంత్రి ప్రొఫెసర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ప్రధానమంత్రి ప్రొఫెసర్‌షిప్‌లో నెలకు రూ.2.50 లక్షలు ఫెలోషిప్‌ను సంవత్సరానికి రూ. 24 లక్షలు పరిశోధన గ్రాంటు, ఓవర్‌హెడ్ భత్యం కింద మరో రూ. లక్ష ఐదు సంవత్సర కాలం వర్తంచనుంది.

టమోటా కిలో రూ.36



అనంతపురంరూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో ఆదివారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.36తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.17తో, సరసరిగా రూ.24తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1350 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

గిట్టుబాట..!

(5వ పేజీ తరువాయి)

రైతులు చెబుతున్నారు. క్వింటా ధర రూ.12 వేల నుంచి రూ.13వేలు పలుకుతోంది. పంట సాగుచేయాలంటే ఎకరాకు రూ.20వేలు పెట్టుబడి అవుతోంది.

క్యారెట్ పంట... రైతుకు అండ

అప్పుల ఊబిలో కూరుకుపోయిన జిల్లా రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాన్ని ఇస్తోంది క్యారెట్ సాగు. ఎకరాలో విత్తనాలు, మందులు, సేద్యంపనులకు రూ.50 వేలు ఖర్చవుతోందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు 12 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం టన్ను ధర రూ.30వేలు పలుకుతోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇచ్చే క్యారెట్ పంట ఎంతో చేయూతనిస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం



తక్కువ పెట్టుబడితో 6 ఎకరాల్లో చియా సాగుచేశా. ఎకరాకి రూ.20వేలు ఖర్చు పెట్టా. ప్రస్తుతం క్వింటా రూ.12 వేల నుంచి రూ.13వేలు పలుకుతోంది. చియా సాగులో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చు. చియా సాగుపై చాలామంది రైతులు ఆసక్తి చూపుతున్నారు.

-రెడ్డిపల్లి రాజారెడ్డి, నారప్పగారిపల్లి

మాండలికానికి గౌరవం తెచ్చిన సీతారాం

సాహితీవేత్త డాక్టర్ శాంతినారాయణ



మాట్లాడుతున్న శాంతినారాయణ

అనంతపురం టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాయలసీమ మాండలికానికి కవిత్వ గౌరవం తెచ్చిన మహనీయుడు కోగిర జై సీతారాం అని సాహితీవేత్త డాక్టర్ శాంతినారాయణ పేర్కొన్నారు. కోగిర జై సీతారాం శతజయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించిన సాహితీ సదస్సుకు శాంతినారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాడుక భాషలో అందమైన పద్యాన్ని నిర్మించడమే కాకుండా, పద్యంలో వ్యంగ్యాన్ని చాలా సమర్థవంతంగా ప్రయోగించారని అన్నారు. దుర్భరమైన పేదరికం నుండి పుట్టుకొచ్చిన కవితా పుష్పం జై సీతారాం అని ప్రశంసించారు. కోగిర జైసీతారాం బాలగేయాల కవిత్వంలో తెలుగు భాష విశిష్టత స్పష్టంగా తెలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు చంద్రశేఖరశాస్త్రి, ఏలూరు యంగన్న, అంకె శ్రీనివాస్, ప్రజ్ఞా సురేష్, కోగిర జయచంద్ర, అడవాల శేషగిరి నాయుడు, కొత్తపల్లి సురేష్, ఈశ్వర్‌రెడ్డి, టీవీ రెడ్డి, వంగళం కొండారెడ్డి, రాజశేఖర్, జయరాం, తరిమెల అమర్నాథరెడ్డి, చిన్నకోట్ల పెద్దిరెడ్డి, కోగిర జైసీతారాం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అరటి రైతు ఆక్రందన..!

ధరలేక పంట దిగుబడిని పారేసిన వైనం



రాయలచెరువు వద్ద పారేసిన అరటి గెలలు

యాడికి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): అరటికి ధరలు లేకపోవడంతో పంట దిగుబడిని పారేస్తున్న వైనం యాడికి మండలంలో ఇంకా కొనసాగుతోంది. రూ.లక్షలకు లక్షలు ఖర్చుపెట్టి ఏడాదిపాటు కష్టపడి కంటికి రెప్పలా కాపాడుకున్న పంటను రోడ్డున పడేయాల్సి రావడంతో అరటి రైతుల ఆక్రందన వర్ణణాభరితం. అరటిపంట దిగుబడిని టన్ను రూ.6వేలకు కొనేలా చేస్తామని అధికారులు చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఒకరో, ఇద్దరో రైతుల దిగుబడిని కోనేలా చేస్తే మిగిలిన రైతుల పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. మండలంలో అరటి రెండవ, మూడవ పంట దిగుబడులను కొనేవారే లేరని రైతులు తెలిపారు. దీంతో పంట దిగుబడిని తొలగించి రోడ్డున పడేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది కిసాన్‌రైలు ద్వారా అరటిని ఢిల్లీకి ఎగుమతి చేశారని, ఈ ఏడాది అధికారులు పట్టించుకోలేదని తెలిపారు.

రేపటి వరకు పది పరీక్ష ఫీజు గడువు

కొత్తచెరువు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు డిసెంబరు 9 వరకు చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని పరీక్షల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ లాజర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అపరాధ రసుం రూ.50తో ఈనెల 12 వరకు, రూ.200తో ఈనెల 15 వరకు, రూ.500తో ఈనెల 18 వరకు చెల్లించవచ్చునని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు రూ.125 పరీక్షా ఫీజుకంటే ఎక్కువ వసూలుచేస్తే చర్యలు తప్పవని ఏడీ హెచ్చరించారు.

డివిజన్ మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నియంత్రణ కోసం గుంతకల్లు డివిజన్‌లోని గుత్తి స్టేషన్ మీదుగా చర్లపల్లి-యల్హంక సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. చర్లపల్లి-యల్హంక ప్రత్యేక రైలు (నం.07187) 8వ తేదీ సోమవారం రాత్రి 10 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11-45 గంటలకు యల్హంకకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07188) 9వతేదీ మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు యల్హంకలో బయలుదేరి బుధవారం తెల్లవారుజాము 4.30కి చర్లపల్లికి చేరుకుంటుందన్నారు. ఈ రైలు హిందూపురం, శ్రీసత్యసాయి ప్రశాంతినిలయం, ధర్మవరం, అనంతపురం, గుత్తి, డోన్, కర్నూలు సిటీ, గద్వాల, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, కాచిగూడ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే దగ్గుపాటి



శ్రీవారి దర్శనం అనంతరం ఆలయం వద్ద ఎమ్మెల్యే, నాయకులు

అనంతపురం క్రైం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామిని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ దర్శించుకున్నారు. ఇటీవల ఇరుముడితో శబరిమలై వెళ్లిన ఆయన అక్కడి అయ్యప్ప స్వామిని దర్శనం చేసుకుని ఆదివారం తిరుమలకు చేరుకున్నారు. వెంకటేశ్వరసామిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు పీఎల్ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వర్, బెస్త పవన్ తదితరులు ఉన్నారు.

'ఆలయంపై రాజకీయాలు వద్దు'

శింగనమల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని దుర్గాంజనేయస్వామి ఆలయం విషయంలో రాజకీయాలు వద్దని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ అన్నారు. దుర్గాంజనేయ స్వామి ఆలయ పూజారి సిరి రమణాచారి వివాదాన్ని తెలుసుకున్న ఆయన ఆదివారం ఆలయం వద్దకు వచ్చి పూజారితో మాట్లాడారు. ఆలయంలో సరైన పద్ధతుల్లో పూజలు చేస్తే ఆరోపణలు ఎందుకొస్తాయన్నారు. ఈ ఆలయం కమిటీ ఆధ్వర్యంలోనే నడుస్తోందని, ఆ కమిటీ చెప్పినట్లుగానే నడుచుకోవాలని సూచించారు. మిమ్మల్ని ఉద్దేశ్యపూర్వకంగా తొలగించాలని చూస్తే మీ తరఫున వైసీపీ పోరాడుతుందని తెలిపారు. ఆత్మహత్య చేసుకుంటానంటూ సోషల్ మీడియాలో బెదిరింపు పోస్టులు పెట్టడం సరైంది కాదన్నారు. ఇకనుంచి అలాంటివి మానుకోవాలన్నారు. మీకు అన్యాయం జరిగితే ఆలయ కమిటీ సభ్యులతోపాటు టీడీపీ నాయకులతో మాట్లాడి న్యాయం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ పూలప్రసాద్, నాయకులు బొమ్మన శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్, టిప్పర్ సీజ్

శింగనమల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో తరిమెల గ్రామ సమీపంలో గల పెన్నానదిలో గత శనివారం రాత్రి అనుమతులు లేకుండా ఇసుకను తవ్వుతున్న ఎక్సకవేటర్‌ను, తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు, మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. తరిమెల వద్దగల పెన్నానదిలో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్సకవేటర్‌తో ఇసుక తవ్వకాలు చేసి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. అందిన సమాచారం మేరకు మైనింగ్, రెవెన్యూ అధికారులతో పాటు సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్ కూమార్ వెంటనే దాడులు నిర్వహించారు. అందులో ఎక్సకవేటర్‌ను, టిప్పర్‌ను సీజ్ చేసి మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

హిందూ సమ్మేళనం

అనంతపురం టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక అశోక్‌నగర్‌లో గల సరస్వతీ విద్యా మందిర్‌లో ఆదివారం సాయంత్రం హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో హిందూ సమ్మేళనం గౌరవాధ్యక్షుడు దాసరి హరిశ్చంద్రరామ మాట్లాడుతూ హిందూ సమాజమంతా ఐక్యంగా నిలిచి సాంస్కృతిక విలువలను కాపాడుకోవాలన్నారు. ముఖ్యంగా సంప్రదాయ పండుగలు, వస్త్రధారణను మనుగడలో ఉంచడం, రామాయణం, మహాభారతం, భగవద్గీత వంటి గ్రంథాలను నిత్యపఠనం చేయడం వంటివి ప్రతి ఇంటి నుంచి ప్రారంభించాలని పిలుపునిచ్చారు. హిందూ సమ్మేళనం ప్రతినిధులు సుధాకర్‌రెడ్డి, హిమకర్‌జీ, నిర్మలమ్మ, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

14న హిందూసమ్మేళనాన్ని విజయవంతం చేయండి

గార్లదిన్నె: మండలకేంద్రంలోని బాలాజీ స్కూల్లో ఈ నెల 14వ తేదీన జరగనున్న హిందూ ధార్మిక సమ్మేళనంను విజయవంతం చేయాలని ఆ సమ్మేళనం జిల్లా ప్రచార కార్యదర్శి వడ్ల రవిబాబు పిలుపునిచ్చారు. స్థానిక బాలాజీ స్కూల్లో ఆయన హిందూ సమ్మేళనంపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. కులమతాలకు అతీతంగా సమాజ నిర్మాణం జరగాలన్నారు ఇందుకు హిందూ బంధువులంతా సంఘటితం కావాలన్నారు. అనంతరం హిందూ సమ్మేళనం మండల కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా రాము, ఉపాధ్యక్షులుగా రామచంద్రాచారి, సురేష్ ఆబు, ఆవుల ప్రసాద్, పీవీ ప్రసాద్‌రెడ్డి, సహాయ కార్యదర్శిలుగా పవన్‌కుమార్, సురేష్, నరేష్‌కుమార్, కృష్ణ, మణికంఠను ఎంపిక చేశారు.

సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం తగదు

అనంతపురం విద్య.డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మండిపడ్డారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం సాగునీరందించే ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. ముఖ్యంగా పీఏబీఆర్ ఎంపీఆర్ గేటు మొరాయించడం, ఉరవకొండ, రాప్తాడు, శింగనమల, ధర్మవరం నియోజకవర్గాలలో 49చెరువులకు సాగునీరందించే పీఏబీఆర్ కుడి కాలువకు గండి పడడం వంటి వాటితో రైతాంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. మరమ్మతులకు కావాల్సిన నిధులు ఇవ్వకపోవడం వల్లనే ఇలాంటి దుస్థితి కలుగుతోందని అన్నారు. వీటిపై వెంటనే స్పందించాలని కోరారు.

ఎరువుల దుకాణాలకు షోకాజు నోటీసులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అనంతపురంలోని రెండు ఎరువుల దుకాణాల యజమానులకు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ షోకాజు నోటీసులు జారీ చేశారు. ఇంటర్ డివిజన్ తనిఖీల్లో భాగంగా ఇటీవల గుత్తి ఏడీఏ వెంకటరాముడు స్థానిక రుద్రంపేటలోని న్యూ శ్రీనివాస ఫర్టిలైజర్స్‌లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఓ ఫామ్‌లు లేకపోవడంతో 3టన్నుల ఎరువుల అమ్మకాన్ని నిలుపుదల చేశారు. అలాగే గుత్తి రోడ్డులోని ఉమాగోదాములోని ఫార్మ్ మాట్రిక్స్ దుకాణంలో తనిఖీ చేపట్టి 220 లీటర్ల లిక్విడ్ ఎరువుల అమ్మకాన్ని నిలుపుదల చేశారు. ఈ నేపథ్యంలో ఆ దుకాణాల యజమాలనులకు ఏడీఏ షోకాజు నోటీసులు జారీ చేశారు. మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.3.32 లక్షలు

అనంతపురంరూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌కు పశువుల సంత ద్వారా రూ.3.32 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి రాఘవేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతతో రూ.1.90 లక్షలు, ఆదివారం ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1.41 లక్షల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

తోటి మిత్రుల ఆర్థిక సాయం..



కుళ్లాయిస్వామికి నగదును అందజేస్తున్న తోటిమిత్రులు

నార్పల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గత ఏడాది నుంచి పక్షవాతంతో బాధపడుతున్న మండలకేంద్రానికి చెందిన కుళ్లాయిస్వామికి తోటి మిత్రులు ఆర్థికసాయం చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. 1991-92వ విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు తన తోటి మిత్రుడైన కుళ్లాయిస్వామి సమస్యను తెలుసుకున్నారు. అనుకున్నదే తడువుగా అందరూ రూ.35 వేలు పోగు చేసి ఆ నగదును ఆదివారం అతడికి ఇంటికొచ్చి అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. తమ మిత్రుడు ఆరోగ్యం కుదుట పడేంత వరకు అండగా ఉంటామని, మరింత ఆర్థిక సాయం అందజేయడానికి వెనకడుగు వేయమని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో..
పని చేయని ఆర్వో ప్లాంట్లు

- వైసీపీ హయాంలో నాడు-నేడు కింద ఏర్పాటు
- ప్రారంభించిన కొన్ని రోజులకే మరమ్మతులు
- విషయం తెలిపినా పట్టించుకోని అధికారులు
- ఏళ్లుగా స్వచ్ఛజలానికి నోచుకోని విద్యార్థులు



శింగనమల మెయిన్ ప్రాథమిక పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న ఆర్వోప్లాంటు

శింగనమల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పని చేయడం లేదు. మొదట్లో కొద్దిరోజులు పని చేసిన ప్లాంట్లు ఆ తర్వాత మరమ్మతుకు గురై నిరుపయోగంగా పడి ఉన్నాయి. దీంతో విద్యార్థులు స్వచ్ఛ జలానికి నోచుకోవడం లేదు. 2020వ సంవత్సరంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం మండలంలో 23 ప్రభుత్వ పాఠశాలలకు నాడు-నేడు కింద రెండు విడతల్లో ఆర్వో ప్లాంట్లను ఇచ్చింది. విద్యార్థుల సంఖ్యను బట్టి పెద్ద ప్లాంటును రూ.1,75,000 లక్షలు, చిన్నప్లాంట్‌ను రూ.40వేలు ఖర్చు చేసి ఏర్పాటు చేశారు. మొదటి విడతలో 16 పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. రెండో విడతలో ఇచ్చిన వాటిలో కొన్ని ప్లాంట్లను మాత్రమే బిగించి మిగిలిన వాటిని బిగించకుండా మెటీరియల్ పాఠశాలల్లోనే ఉంచారు. బిగించిన ప్లాంట్లు ప్రారంభంలో పని చేసినా.. చాలావరకు నెలకే మరమ్మతులకు గురయ్యాయి. బాగు చేయించాలని ఉపాధ్యాయులు పైఅధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా.. ఎవరూ స్పందించలేదు. ఫలితంగా విద్యార్థులకు స్వచ్ఛజలం అందకుండాపోయింది. ఇప్పటికైనా అధికారులు పాఠశాలల్లో స్వచ్ఛజలం అందించేందుకు కృషి చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

కలెక్టర్ ఆదేశాలతోనైనా.. స్వచ్ఛ జలం దక్కేనా?

ఇటీవల కలెక్టర్ ఆనంద్ పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛ జలం కోసం ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంటుపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలోని పాఠశాలల్లో ఎక్కడెక్కడ ఆర్వో ప్లాంట్లు పని చేయకుండా ఉన్నాయో నివేదికను తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయన చర్యలు చేపట్టి ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేయించి విద్యార్థులకు స్వచ్ఛజలం అందిస్తారేమోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.

నాలుగేళ్లుగా చుక్కనీరు రాలేదు..



మా బడిలో 2020వ సంవత్సరంలో ఆర్వోప్లాంట్ బిగించా రు. మొదట్లో వారం రోజులు స్వచ్ఛజలం వచ్చాయి. తరువాత ప్లాంట్ మరమ్మతుకు గురైంది. ఇక నాలుగు ఏళ్లుగా స్వచ్ఛజలం రాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాంట్‌కు మరమ్మతులు చేసి స్వచ్ఛ జలం వచ్చేలా చూడాలి.

-కవిత, 5వ తరగతి విద్యార్థిని, శింగనమల

సార్లు ఫిల్టర్ నీటిని తెప్పిస్తున్నారు...



తమ పాఠశాలలో విద్యార్థులు కొళాయిల్లోంచి వచ్చే ఫ్లోరైడ్ నీటిని తాగుతున్నారని మా సార్లు రోజు క్యాన్లలో ఫిల్టర్ నీటిని తెప్పిస్తున్నారు. మాకు ఆర్వో ప్లాంటు ఉన్నా నీరు మాత్రం రాదు. అధికారులు వెంటనే మరమ్మతులు చేయించి దానిని వినియోగంలోకి తేవాలి.

- వెంకటేశ్ విష్ణు, 4వ తరగతి విద్యార్థి , శింగనమల

ఆర్వోప్లాంటు మరమ్మతుకు గురైంది..

మా పాఠశాలలో గతంలో ఆర్వో ప్లాంటును నాడు నేడు కింద బిగించారు అయితే అది కొద్ది రోజులు మాత్రమే పని చేసింది. తర్వాత మోటార్ పని చేయడం లేదు. అలాగే ట్యాంకు కూడా లీకేజ్ ఉందని తెలిసింది. ఈ విషయాలనుపై అధికారులకు తెలియజేశాను.

- రాజశేఖర్ హెచ్ఎం, శింగనమల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

నిధులు రాకపోవడంతోనే రిపేర్లు చేయలేకపోతున్నాం..

మండలానికి నాడు నేడు కింద 23 పాఠశాలలకు ఆర్వో ప్లాంట్లు ఇచ్చారు. మొదట విడతలో అన్ని ఆర్వో ప్లాంటు బిగిం చారు. అయితే అవన్నీ కొద్ది రోజులు మాత్ర మే పని చేసి తర్వా త రిపేర్లకు వచ్చాయి. నిధులు రాకపోవడంతో వాటిని మరమ్మతు చేయించలేకపోతున్నాం. మండలంలో ప్రస్తుతం ఒకటి రెండు తప్పు ఎక్కడా ప్లాంట్లు పని చేయలేదు. ఈవిషయాన్ని పైఅధికారులకు నివేదికలు పంపాం.

- నరసింహరాజు, ఎంఈఓ, శింగనమల

పంపనూరు ఆలయాన్ని మరింత అభివృద్ధి చేద్దాం

- పాలకమండలి ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే పరిటాల సునీత



పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవ సభలో మాట్లాడుతున్న పరిటాల సునీత

ఆత్మకూరు డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ప్రసిద్ధ ఆలయాల్లో ఒకటిగా తీర్చిదిద్దడానికి కృషి చేద్దామని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. ఆలయంలో ఆదివారం ఆలయ నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగి హాజరయ్యారు. తొలుత భక్తుల సౌకర్యార్థం రూ.30లక్షల వ్యయంతో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించారు. అలాగే మంజునాథ స్వామి ని, పార్వతీదేవిని కూడా పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తర్వాత ఆలయ నూతన పాలకమండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి మాట్లాడారు. ఉమ్మడి అనంత జిల్లాలో ఈ ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. దీనిని మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలోని ప్రసిద్ధి ఆలయాల్లో ఒకటిగా తీర్చిదిద్దుదామని తెలిపారు. రూ.14 కోట్లతో ఆలయాన్ని ఆధునికీకరించడానికి దేవాదాయ అధికారులు తయారు చేసిన ప్రతిపాదనను సీఎం చంద్రబాబు, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రానారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రస్తుతం భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయం వద్ద, బస్టాండు వద్ద, సమీపంలోని మలోబులేసుని కొండపై మరుగుదొడ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వన్నూరు స్వామి, కార్యనిర్వహణాధికారి బాబు, టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, మండల కన్వీనర్ శ్రీనివాసులు, సొసైటీ చైర్మన్ క్రిష్ణమోహన్ చౌదరి, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంకచౌదరి. పలువురు నాయకులు పాల్గొన్నారు.

పాలకమండలి చైర్మన్‌గా వేణుగోపాల్‌రెడ్డి

పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ పాలకమండలి నూతన చైర్మన్‌గా వేణుగోపాల్ రెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే సభ్యులుగా రేణాటి నాగేశ్వర రెడ్డి, గోవింద్‌నాయక్ కాశీభట్ల రామక్రిష్ణ శాస్త్రి, రామక్క, పద్మావతి, మంగళ ఆనంద్, బొమ్మక్క, సీతారామ మోహన్ శర్మ, విజయలక్ష్మి, రామక్రిష్ణతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం వీరిని పలువురు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

'జగన్ పాలన అంతా అక్రమాలే'



మాట్లాడుతున్న సిమెంట్ పోలన్న

అనంతపురంక్రైం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ పాలనంతా అక్రమాలతోనే సాగిందని, తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూప్రసాదంలో కల్తీ నెయ్యి, పరకామణి స్కామే ఇందుకు నిదర్శనమని టీడీపీ బీసీ నాయకుడు సిమెంట్ పోలన్న విమర్శలు గుప్పించారు. నగరంలోని తన నివాసంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసీపీ హయాంలో టీటీడీలో జరిగిన తప్పులు చిన్నవేనని ఇటీవల జగన్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఆ వ్యాఖ్యలు భక్తుల మనోభావాలను కలచివేసిందన్నారు. కల్తీ నెయ్యి, పరకామణి స్కాం జగన్ అక్రమాల పాలనకు నిదర్శనమన్నారు. జగన్ ఇలాగే వ్యాఖ్యలు చేస్తే ఆయన కార్యాలయాన్ని ముట్టడించేందుకూ వెనకాడమని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

అఖండ-2 త్వరగా రిలీజ్ కావాలని పూజలు



శివలింగాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

గార్లదిన్నె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ-2 సినిమా అన్ని అడ్డంకులు తొలగి త్వరగా రిలీజ్ కావాలని ఐ టీడీపీ అధికార ప్రతినిధి సాకే శివానంద కోరారు. ఈ మేరకు కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని 108 శివ లింగాలకు పాలభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ... అఖండ-2 సినిమా ఈనెల 5నవిడుదల కావాల్సి ఉందని, అయితే అనివార్య కారణాలతో విడుదల రద్దయిందని, దీంతో అభిమానుల్లో తీవ్ర నిరాశ నెలకొందని తెలిపారు. అన్ని అడ్డంకులు తొలగి సినిమా త్వరగా విడుదల కావాలని దేవున్ని ప్రార్థించినట్లు చెప్పారు. పలువురు టీడీపీ అభిమానులు, అభిమానులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

గార్లదిన్నె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐక్యంగా ఉండి పోరాడితేనే హక్కులు సాధించుకోవచ్చునని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ సూచించారు. మండలకేంద్రంలో ఆదివారం ఆటోకార్మికులతో జిల్లా కమిటీ సభ్యుడు రాజశేఖర్‌శెట్టి సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లాప్రధానకార్యదర్శి సురేష్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సాధించుకోవాలంటే కార్మికులందరూ ఐక్యతగా ఉండాలన్నారు. మోటార్ రావాణా రంగానికి, కార్మికులకు నష్టం కలిగిస్తున్న జీవో 21ను ప్రభుత్వం రద్దు చేసేలా ఆటో కార్మికులు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా లేబర్‌కోడ్‌లను తీసుకురావడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆటోకార్మికులు తమ హక్కుల కోసం చేసే పోరాటాల్లో అందరూ ఒకతాటిపైకి రావాలని సూచించారు. అనంతరం ఆటో కార్మికుల అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా నాగరాజు, కో కన్వీనర్లుగా రమణారెడ్డి, నారాయణస్వామితో పాటు సభ్యులుగా నాగేంద్ర, ఆది, రహంతుల్లా, పుల్లయ్య, దావీద్, నాగరాజు,నర్సప్ప, ఎన్నుకున్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటి సభ్యులు శివయ్య, ముత్యాలు పాల్గొన్నారు.

వాజ్‌పేయి విగ్రహావిష్కరణకు తరలిరండి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారి వాజ్‌పేయి విగ్రహావిష్కరణ ఈనెల 12వ తేదీన స్థానిక గుత్తిరోడ్డులో జరగనుందని, కూటమి శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ పిలుపునిచ్చారు. ద్వారకానగర్‌లోని కార్యాలయంలో ఆదివారం ఆయన పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు విగ్రహావిష్కరణకు ఏర్పాట్లపై, జనసమీకరణపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ విగ్రహావిష్కరణకు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు ,జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఈశ్వర్ ప్రసాద్, పామిశెట్టి నాగరాజు, లలిత్‌కుమార్, లక్ష్మీదేవి, కిరణ్‌గౌడ్, రత్నమయ్య, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌కు స్వదేశీ వస్తువు బహూకరణ



సీఎస్‌కు టీ కప్ అందజేస్తున్న బీజేపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను బీజేపీ నాయకులు జిల్లాకేంద్రంలో ఆదివారం కలిసి స్వదేశీ వస్తువును బహూకరించారు. భారత్‌లో తయారు చేసిన ఓ టీ కప్‌ను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా స్వదేశీ వస్తువులు వాడాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారని, దేశ ప్రజలు ఆ బాటలో నడుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై అండమాన్‌లో కాన్ఫరెన్స్

అనంతపురం వైద్యం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజా ఆరోగ్య సంరక్షణపై అండమాన్ నికోబార్‌లో నాలుగో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. శుక్ర, శనివారాల్లో రెండురోజులపాటు నిర్వహించిన ఈ సదస్సుకు జిల్లా ప్రతినిధిగా తాను పాల్గొన్నట్లు హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ ఆఫీసర్(హెచ్‌ఈఈఓ) మిడతల త్యాగరాజు ఆదివారం తెలిపారు. వివిధ అంశాలపై సమీక్షలు చేసిన తర్వాత అండమాన్ పరిసర ప్రాంతాలను పర్యటించి అక్కడి ప్రజల ఆరోగ్య పరిస్థితులపై పరిశీలించామన్నారు. తద్వారా భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. దేశవ్యాప్తంగా అన్ని జిల్లాలనుంచి ప్రతినిధులు హాజరయ్యారన్నారు. ముఖ్య అతిథిగా అండమాన్ నికోబార్ హెల్త్ డిపార్ట్‌మెంట్ డీడీ డాక్టర్ అభిజిత్ రాయ్ పాల్గొని సలహాలు, సూచనలు ఇచ్చారని పేర్కొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

అనంతపురం క్రైం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లకు పోలీసులు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లను సీఐలు, ఎస్ఐలు స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనవసర గొడవలకు దిగుతూ..శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంతంగా ఉండి సమాజంలో గౌరవప్రదంగా జీవనం సాగించాలని ఆదేశించారు.

అలరించిన సాంస్కృతిక సంబరాలు



కళాకారులతో డీఆర్వో మలోల

అనంతపురం టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతిని పురస్కరించుకుని అనంతనాగ్ సంగీత్ స్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కృష్ణకళామందిర్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక సంబరాలు అలరించాయి. డీఆర్వో మలోల ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పాటు ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు చిన్నారులు జానపద నృత్యాలు చేసి అలరించారు. తర్వాత డీఆర్వోతో పాటు సంగీత కళాకారులు ఘంటసాల పాటలు ఆలపించి వీక్షకులకు వీనులవిందు చేశారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు నాగిన్ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు, కృష్ణవేణి, శ్రీదేవి, కె.కృష్ణవేణి, వెంకట్రావు, కంబగిరి, అర్చన, లక్ష్మి, షైలారప్ప పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనంగా ఘనంగా జరిగింది. ఆ పాఠశాలలో 1984-85వ విద్యాసంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులు 50 మంది సుమారు 40 ఏళ్ల తర్వాత అదే పాఠశాలలో కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి గురువులు ఆదినారాయణరెడ్డి, ఓబుళేశును శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. సాయంత్రం వరకు అక్కడే ఆనందంగా గడిపారు.

రాప్తాడు మార్కెట్‌యార్డులో సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర సదస్సులో చైర్మన్ సుధాకర్ చౌదరి వినతి



వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న సుధాకర్ చౌదరి

కనగానపల్లి, డిసెంబరు 7(ఆంధ్ర జ్యోతి): మంగళగిరిలో ఆదివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల సదస్సు జరిగింది. ఇందులో రాప్తాడు మార్కెట్‌యార్డు చైర్మన్ బోయపాటి సుధాకర్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. రాప్తాడు మార్కెట్ యార్డుకు సొంతస్థలం కేటాయించడంతో పాటు రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. అలాగే వినతిపత్రం అందజేశారు. అనంతరం రాష్ట్ర మార్కెట్‌యార్డు చైర్మన్ల అసోసియేషన్ ఏర్పాటు చేయగా అందులో సుధాకర్ చౌదరిని అధికార ప్రతినిధిగా నియమించినట్లు తెలిసింది. ఆయన వెంట క్లస్టర్ ఇన్‌చార్జిలు పూజారి రాజాక్రిష్ణ, బిల్లే దాము ఉన్నారు.

పీవీకేకేలో ముగిసిన స్పోర్ట్ టెక్



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ముఖ్యఅతిథులు

అనంతపురంరూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఆలమూరు రోడ్డులో గల పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న స్పోర్ట్‌టెక్-2కే25 పేరిట నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఆర్‌వీ అండ్ ఈఓ అడిషనల్ ఎస్పీ యర్లగడ్డ ప్రసాద్ ,బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు, రన్నర్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా యర్లగడ్డ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. పల్లె కిశోర్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపడతామని తెలిపారు. పీవీకేకే ఐటీ ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, ప్రత్యేకాధికారి శ్రీనివాసులురెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, డీన్ సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీపీఓ కార్యాలయ ఏఓగా సోముశేఖర్?

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయం ఏఓగా డీఎల్‌పీఓ కార్యాలయం ఏఓ సోముశేఖర్‌ను నియమించినట్లు తెలిసింది. ఇప్పటి వరకు ఉన్న ఏఓ గత నవంబరులో రిటైర్డ్ అవడంతో ఆ స్థానం ఖాళీ అయింది. దీంతో సమీపంలోనే డీఎల్‌పీఓ కార్యాలయం ఏఓగా ఉన్న సోముశేఖర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించేలా ఫైల్ సిద్ధం చేశారు. ఆయన అప్పటికే తమ వ్యక్తిగత పనులపై సెలవులో ఉండటంతో ఉత్తర్వులు అమలు కాలేదు. తాత్కాలికంగా డీపీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న భారతికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే శనివారంతో సెలవు ముగించుకొని సోముశేఖర్ విధుల్లో చేశారు. కాగా ఆ యన డీపీఓ కార్యాలయం ఏఓగా బాధ్యతలు చేపట్టడానికి విముఖత చూపుతున్నట్లు తెలిసింది. దీంతో ఆ ఉత్తర్వులను అమలు చేస్తారా..? లేక ఇన్‌చార్జి ఏఓగా సీనియర్ అసిస్టెంట్ భారతినే కొనసాగిస్తారా.. ఏమిటన్నది తెలియాలంటే వేచి చూడాల్సిందే.

గార్లదిన్నె ఇన్‌చార్జి ఎంపీడీఓగా గోపాల్

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా డిప్యూటీ ఎంపీడీఓ గోపాల్‌ను నియమించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఉన్న ఎంపీడీఓ యోగానందరెడ్డి వ్యక్తిగత పనులపై సెలవులో వెళ్లారు. ఆ స్థానంలో ఇన్‌చార్జిగా డిప్యూటీ ఎంపీడీఓ గోపాల్‌ను నియమించినట్లు తెలిసింది. సోమవారం అధికారికంగా ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది.

నెరవేరని నేమకల్లు హామీలు..!

- సీఎం హామీలిచ్చి ఏడాదైనా అమలు కాని వైనం
- నేటికీ అభివృద్ధికి నోచుకోని ఆలయం
- బస్సు సౌకర్యమూ కల్పించని అధికారులు
- శాఖల మధ్య నేటికీ తిరుగుతున్న ఫైళ్లు
- చొరవచూపని జిల్లా అధికారులు




నేమకల్లులో మాట్లాడుతున్న సీఎం(ఫైల్), బస్సు లేకపోవడంతో కాలేజీకి నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

బొమ్మనహాళ్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లులో గత ఏడాది నవంబరు 30న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజావేదిక నిర్వహించారు. గ్రామ అభివృద్ధి.. సమస్యల పరిష్కారంపై ఆ వేదికపై అనేక హామీలిచ్చారు. దీంతో తమ గ్రామ దశ తిరుగుతుందని ఆ గ్రామస్థులు ఆశించారు. ఏడాదైనా వాటి అమలుపై జిల్లా అధికారులు ఏ మాత్రం చొరవ చూపలేదు. గ్రామంలో సీసీరోడ్లు, మురుగు కాలువ నిర్మాణాలు మాత్రం పూర్తయ్యాయి. మిగతా హామీలను అధికారులు పట్టించుకోలేదు. దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్నట్లు అయింది ఆ గ్రామస్థుల పరిస్థితి. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అనే సామెతకు ఈ గ్రామం ఓ నిదర్శంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం వల్ల నేటికీ సమస్యల మధ్య.. అభివృద్ధికి దూరంగా ఆ గ్రామం అలాగే ఉండిపోయింది. నాడు సీఎం ఇచ్చినా అమలుకాని హామీలను పరిశీలిస్తే..

● ఆలయ అభివృద్ధి : నేమకల్లులో రాష్ట్రస్థాయిలో ప్రఖ్యాతి గాంచిన ఆంజనేయస్వామి ఆలయం ఉంది. ఆ ఆలయాన్ని సీజీఎఫ్ నిధులు రూ. మూడు కోట్లతో అభివృద్ధి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు.

● బస్సు సౌకర్యం: ఇంత పేరు గాంచిన ఈ గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. దీంతో నేమకల్లు ఆంజనేయస్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బళ్లారి రోడ్డు వద్ద బస్సు దిగి.. నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి ఆటోలల్లో.. ప్రాణాలను అర చేతిలో పెట్టుకొని వస్తున్నారు. ఈ గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు. ముఖ్యంగా బాలికలు విద్యకు దూరమయ్యారు.

● గురుకుల పాఠశాల: ఈ గ్రామస్థుల అభ్యర్థన మేరకు నాడు సీఎం ఈ గ్రామంలో ఓ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఇదీ అమలు కాలేదు.

● అర్హులకు ఇళ్లు : అర్హులందరికీ తప్పకుండా ఇళ్లమంజూరు చేయిస్తానని ముఖ్యమంత్రి నాడు హామీ ఇచ్చారు. ఏడాదిగా దీన్ని అధికారులు పట్టించుకోలేదు. ఇటీవల పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్ల మంజూరుకు అధికారులు హడావిడి చేస్తున్నారు.

● యువతకు ఉపాధి: పలు పరిశ్రమలు ఏర్పాటు చేసి.. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చినా.. వాటిని అమలు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. శాఖ మధ్య సమన్వయ లోపం.. ఫైళ్ల కదలికలో నిర్లక్ష్యం.. బాధ్యతారాహిత్యం.. ఉన్నతాధికారుల చొరవ లేకపోవడం.. ఈ గ్రామానికి శాపాలుగా మారాయి. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ చూపి.. గ్రామంలో సమస్యలు పరిష్కరించి.. అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

చదువు మానేశారు



సీఎం చంద్రబాబు హామీతో కొద్దిరోజులు మాత్రమే బొమ్మనహాళ్‌కు బస్సును నడిపారు. దీంతో మేం కాలేజీకి సమయానికి వెళ్లేవాళ్లం. మళ్లీ ఆ బస్సును తీసేయడంతో ప్రతిరోజూ మా గ్రామం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న రోడ్డు వరకు వెళ్లి.. అక్కడి నుంచి బొమ్మనహాళ్‌కు ఆటోలు.. బస్సుల్లో వెళ్తున్నా. ఇలా రోజూ మేం ఎనిమిది కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది. ఎవరైనా బైక్‌దారులు వెళ్తుంటే.. వారిని లిఫ్ట్ అడిగి వెళ్తున్నాం. ఒక్కోసారి కళాశాలకు ఆలస్యంగా వెళ్తుండటంతో అధ్యాపకులు మందలిస్తున్నారు. చాలా ఇబ్బందిగా ఉంది. బస్సు రద్దుతో తొమ్మిది మంది చదువు మానేశారు.

-సునీల్, ఇంటర్ విద్యార్థి, నేమకల్లు

రోజూ నాన్న వస్తున్నాడు



బొమ్మనహాళ్‌కు బస్సు సర్వీసు రద్దు చేసినప్పటి నుంచి ప్రతి రోజూ నన్ను మా నాన్న బైక్‌పై కాలేజీ వద్ద విడిచిపెట్టి రావడానికి.. మళ్లీకి పిలుచుకొని వెళ్లడానికి వస్తున్నారు. ఉదయం పొలం పనులు, దినసరి కూలి ఏది ఉన్నా వాటిని వదులుకొని వస్తున్నాడు. ఇలా రోజూకు రెండు సార్లు బొమ్మనహాళ్‌కు బైక్ వచ్చివెళ్తుండటంతో పెట్రోల్ ఖర్చు కూడా అధికంగా వస్తోంది. బస్సు ఉంటే మేమందరం సులభంగా వెళ్లేవాళ్లం. మా నాన్నకూ ఇబ్బంది ఉండేది కాదు.

-బిందు, ఇంటర్ విద్యార్థిని, నేమకల్లు

న్యూస్ బాక్స్

సుంకులమ్మ సేవలో ప్రముఖులు



ఆలయంలో విజయానంద్, వెంకటశివుడు యాదవ్

గుత్తిరూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిడికొండ గ్రామ శివారులో బాట సుంకులమ్మ వద్ద ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దారు పుణ్యవతి ఘనస్వాగతం పలికారు. జిల్లా పర్యటన అనంతరం విజయవాడకు వెళ్తూ సుంకులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట డిప్యూటీ ఎంపీడీఓ నరసింహారెడ్డి, టీడీపీ నాయకులు సుధాకర్‌నాయుడు ఉన్నారు.

సూర్యనారాయణ సేవలో...



తీర్థప్రసాదాలను అందజేస్తున్న అర్చకులు

ఉరవకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవిలోని సూర్యనారాయణస్వామిని తెలంగాణ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవి ఆదివారం దర్శించుకున్నారు. ఆమె పేరిట అర్చకులు ప్రత్యే పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ విశిష్టతను ఆమెకు వివరించారు. తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు ప్రకాష్, బసవరాజు, కమిటీ సభ్యులు మహేంద్ర గౌడ్, సుధాకర్, నగేష్ పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న నాయకులు

రాయదుర్గంరూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పంటకు గిట్టుబాటు ధర కల్పించి.. రైతులను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లప్ప, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వారు మాట్లాడుతూ.. పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో జిల్లాలో వారంరోజుల్లో ఆరుగురు రైతులు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారన్నారు. అరటి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే పంటకు గిట్టుబాటు ధరతో పాటు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వారి వెంట సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున, మధు, కోరి నాగరాజు, రమేష్, మల్లికార్జున ఉన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విప్ కాలవ

కణేకల్లు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనకనహాళ్‌లో రూ. 20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ వన్నారెడ్డి, రూరల్‌బ్యాంక్ అధ్యక్షుడు వాల్మీకి నాగార్జున, టీడీపీ నాయకులు ఎస్కే మల్లికార్జున, లాలెప్ప, ఆనంద్‌రాజ్, సుదర్శన్, వేలూరు మరియప్ప పాల్గొన్నారు.

● పరామర్శ: అనారోగ్యానికి గురై కోలుకున్న సొల్లాపురం సీనియర్ టీడీపీ నాయకుడు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ శేషప్పను విప్ పరామర్శించారు.

గ్యాస్ సబ్సిడీపై అవగాహన

గుంతకల్లుటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణంలో ఆదివారం దీపం పథకం-2 కింద గ్యాస్ సబ్సిడీపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ రమాదేవి మాట్లాడుతూ.. ఒక రేషన్ కార్డులో ఇద్దరు గ్యాస్ కనెక్షన్లు ఉన్నా, ఇన్‌కం ట్యాక్స్ చెల్లిస్తున్నా, వెయ్యి చదరపు అడుగుల స్థలమున్నా, వాహనాలు పేరుమీద ఉన్నా.. గ్యాస్ సబ్సిడీ రాదన్నారు. సబ్సిడీ పడినా ఒక్కోసారి సెల్ ఫోన్‌ను మెసేజ్ రాదన్నారు. అనంతరం వినియోగదారులు అడిగిన ప్రశ్నలకు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సమాధానం చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మెహరున్నీసా బేగం, మాజీ కౌన్సిలర్లు అంజి, చంద్రయ్య, నాయకులు ఇలియాజ్ ఖాన్, ప్రభాకర్, వీరేష్, మస్తాన్, గ్యాస్ నిర్వాహకులు పాల్గొన్నారు.

స్కూల్లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

శెట్టూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖైరేవు హైస్కూల్లో తాగునీటి సమస్య ఉంది. విద్యార్థులు ఇళ్ల నుంచే తాగునీటి తెచ్చుకొంటున్నారు. మధ్యాహ్నం భోజన సమయంలో ఇబ్బందులు పడేవారు. దీన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సమస్యను టీడీపీ నాయకుడు బోయ రామాంజినేయులు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తన సొంత డబ్బుతో ఆదివారం ఆ పాఠశాలలో బోరు వేయించాడు. 140 అడుగుల్లో నీరు పడింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గాజుల మనోహర్, స్కూల్ కమిటీ చైర్మన్ కల్లేశ్వర, జీ లక్ష్మణమూర్తి, అంజి, కరెన్న, అబ్దుల్ బ్రహ్మయ్య గ్రామస్థులు పాల్గొన్నారు.



బోరు వేయిస్తున్న టీడీపీ నాయకులు

భోగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పామిడి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక భోగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని విశేష పూజలు చేపట్టారు. స్వామి వారికి వేకువజామునే అర్చకులు రుద్రాభిషేకం, అన్నాభిషేకం చేపట్టారు. ఈ పూజలకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.




అలంకరణలో భోగేశ్వరుడు, పూజలో పాల్గొన్న భక్తులు

మరమ్మతులు చేయండి

శెట్టూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శెట్టూరు - కళ్యాణదుర్గం రహదారి మధ్యలో ఇలా భారీ గుంత ఏర్పడింది. దీన్ని తప్పించపోయి.. ద్విచక్రవాహనదారులు అనేక ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఇక్కడ అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి.. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

తాగునీటి సమస్య పరిష్కరించండి

కుందుర్పి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొన్ని నెలలుగా తాగునీటి సమస్యతో తాము ఇబ్బందులు పడుతున్నామని కొలిమిపాల్యం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆ గ్రామస్థులు ఆదివారం ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేశారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినా.. వారు పట్టించుకోలేదన్నారు. తాము నీటికోసం పొలాలకు వెళ్తున్నామని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

నిరుపయోగంగా గోదాము

- దారి లేకుండా నిర్మించిన అధికారులు
- రూ.17 లక్షల ప్రజాధనం వృథా



గుత్తిలో వృథాగా ఉన్న వ్యవసాయ గోదాము

గుత్తి,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల రైతుల సౌకర్యార్థం 2018 టీడీపీ ప్రభుత్వం స్థానిక రెవెన్యూ కార్యాలయం వెనుక భాగంలో గోదామును ఏర్పాటు చేసింది. సివిల్ సప్లై గోదాముల పక్కనే దీన్ని రూ.17 లక్షలతో నాడు నిర్మించింది. అధికారుల అనాలోచిత నిర్ణయం వల్ల .. ఆ గోదాముకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయలేదు. ఈ గోదాముకు కోర్టు ప్రాంగణం నుంచి లారీలు వెళ్లేందుకు అనుమతులు లేవు. ఇక కర్నూలు వైపు నుంచి నేరుగా సివిల్ సప్లై గోదాము నుంచి వచ్చేందుకు కూడా దారి లేదు. దీంతో సరైన దారి లేక.. ఈ గోదాము వృథాగా పడి ఉంది. దీంతో అక్కడ కంపచెట్లు భారీ గా పెరిగాయి. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు ఆ గోదామును వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఏడీఈ వెంకటరాముడును వివరణ కోరగా... గోదాము రస్తా విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని, త్వరలోనే దాన్ని వినియోగంలోకి తెస్తామని అన్నారు.

ఇన్‌ఫ్లో 2,560 క్యూసెక్కులు

బెళుగుప్ప, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,560, ఔట్‌ఫ్లో 2,560 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.724 టీఎంసీల నీరు ఉందని, ఇక్కడి నుంచి ఫేజ్-2కు 1,810 క్యూసెక్కులు నీరు వెళ్తోందని తెలిపారు.

విద్యార్థికి ఆర్థికసాయం

తాడిపత్రి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన నర్సింగ్ వి ద్యార్థిని గౌతమి ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతోంది. దీంతో స్థానిక ప్రభుత్వ పెన్ననర్ల భవనంలో గౌతమికి రూ.10వేలు ఆర్థికసాయం ఆదివారం అందజేసినట్లు ఆసంఘం వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ తెలిపారు.

అన్నదాన ప్రభువే ... శరణం అయ్యప్ప

ఉరవకొండ ఆలయంలో 20 ఏళ్లుగా కొనసాగుతున్న భిక్ష

ఉరవకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక అయప్పస్వామి ఆలయంలో భిక్ష (అన్నసంతర్పణం) కార్యక్రమం 20 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. 1996లో ఈ ఆలయాన్ని నిర్మించారు. 2006 నుంచి దాతలు, బ్యాంకులో ఉన్న డిపాజిట్ల ద్వారా వచ్చే వడ్డీలతో ఈ భిక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఏటా నవంబరు 16 నుంచి మకరజ్యోతి వరకూ స్వాములకు ఈ భిక్షను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంలో రోజుకు మధ్యాహ్నం, రాత్రి కలిపి సుమారుగా 500 మంది అయ్యప్ప, ఇతర మాలాధారులకు భిక్షను ఏర్పాటు చేస్తున్నారు.



ఉరవకొండ అయ్యప్ప ఆలయంలో భిక్ష చేస్తున్న స్వాములు

దాతల సహకారంతోనే



ఇరవై ఏళ్లుగా ఆలయంలో దాతలు, భక్తుల సహకారంతో భిక్ష నిర్వహిస్తున్నాం. దాతలు ఇచ్చిన నగదును బ్యాంకులో డిపాజిట్ చేసి.. దానిపై వచ్చే వడ్డీతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. అనేక మంది దాతలు భిక్షకు కూరగాయాలు, ఆకుకూరలు ఇస్తున్నారు. స్వామి కృప వల్ల ఈ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోంది.

-వెంకటేష్, గురుస్వామి, పీఆర్ డీఈ

భిక్షకు ఇబ్బంది లేదు



స్వాములకు ఆలయంలో ఇరవై ఏళ్ల నుంచి భిక్ష పెడుతున్నాం. దాతలు సహకరిస్తుండటంతో ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. అయ్యప్ప స్వాములకే కాకుండా ఇతర మాలధారులకూ ఇక్కడ భిక్ష పెడుతున్నాం.

-పరశురాం, అయ్యప్ప భక్తుడు

క్రైం న్యూస్..

బైకులు ఢీకొని వ్యక్తి మృతి



చంద్రమౌళి (ఫైల్)

బెళుగుప్ప, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాద్రిపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన చంద్రమౌళి (65) మరణించాడు. ఇతను బెళుగుప్ప నుంచి స్వగ్రామానికి రాత్రి బైకుపై వస్తుండగా.. ఎదురుగా మరో బైక్‌పై వచ్చిన తిప్పేస్వామి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడగా.. వారిని చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలిస్తుండగా. మార్గమధ్యలో చంద్రమౌళి మరణించాడు. చంద్రమౌళికి భార్య శకుంతల, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. బెళుగుప్ప పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పొలంలో స్టార్టర్ చోరీ

యాడికి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరన్నపల్లిలో రైతు రమేష్‌కు చెందిన పొలంలో బోరుబావికి అమర్చిన స్టార్టర్ బాక్స్ శనివారం రాత్రి చోరీకి గురైంది. ఆదివారం రమేష్ మాట్లాడుతూ.. దాని విలువ రూ. 15 వేలని, తాను సాగు చేసిన నిమ్మచెట్లకు నీరు వదలడానికి దాన్ని ఏర్పాటు చేసుకున్నాని తెలిపారు. పోలీసులు రాత్రివేళల్లో గస్తీ పెంచి ఈ దొంగల ఆగడాలను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.

వ్యక్తికి గాయాలు

గుత్తిరూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊబిచేర్ల గ్రామశివారులోని జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలుకు చెందిన ప్రభాకర్ గాయపడ్డాడు. అతను బైక్‌పై స్వగ్రామం నుంచి బెంగళూరుకు వెళ్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అతను కింద పడి గాయపడ్డాడు. స్థానికులు అతన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వ్యాన్ దగ్ధం



దగ్ధమైన వాహనం

పుట్లూరు, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ. కొండాపురం - ముచ్చుకోట గ్రామాల మధ్య ఆదివారం తెల్లవారుజామున పాతటైర్ల లోడుతో వెళ్తున్న ఓ వ్యాన్ ఇంజన్‌లో నుంచి మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ రోడ్డు పక్కన ఆ వ్యాన్‌ను ఆపి.. మంటలు ఆర్పేందుకు విఫలయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకునేలోపే వ్యాన్, అందులోని టైర్లు పూర్తిగా కాలిపోయాయి. వ్యాన్ అనంతపురం నుంచి విజయవాడకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కేసు దర్యాప్తులో ఉంది.

జూదరుల అరెస్ట్

పెద్దవడుగూరు, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టిపాడు గ్రామ సమీపంలోని పొలాల్లో ఆదివారం పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్‌చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. వారి వద్ద ఉన్న రూ.11,900ను స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



రేకులను తొలగించుకుంటున్న దుకాణ యజమానులు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బళ్లారి సర్కిల్‌లో సర్వే నెంబరు 424-బీలో 23 సెంట్లు, సర్వే నెంబరు 412-2లో 31 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలాన్ని పట్టణానికి చెందిన జీ దేవేంద్రప్ప, అతని కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి 1.5 సెంట్ల ప్రకారం ఇంటి స్థలాల ఇచ్చినట్లు బోగస్ పట్టాలు సృష్టించారు. ఆ స్థలంలో దేవేంద్రప్ప దాదాపు 12 కమర్షియల్ కాంప్లెక్స్‌లను నిర్మించి అద్దెలకు ఇచ్చాడు. ఆ షాపుల నుంచి నెలకు రూ. లక్షలు బాడుగలు వసూలు చేస్తున్నాడు. దీనిపై పలు రాజకీయ, కులసంఘాల నాయకులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన తహసీల్దార్ ఈ ఏడాది ఆగస్టు 18న దేవేంద్రప్పకు నోటీసులు ఇచ్చారు. దీనిపై అతను కోర్టును ఆశ్రయించగా.. అతని వ్యాజ్యాన్ని కోర్టు డిస్మిస్ చేసింది. దీంతో ఆదివారం రెవెన్యూ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో ఆ కమర్షియల్ కాంప్లెక్స్‌ను కూల్చేందుకు వెళ్లారు. ఆ కాంప్లెక్స్‌లో బాడుగులకు ఉన్నవారు తామే సొంతంగా తొలగించుకుంటామని అధికారులను కోరడంతో అందుకు తహసీల్దారు రమాదేవి, డిప్యూటీ తహసీల్దారు నారాయణస్వామి అంగీకరించారు.

పేద వృద్ధురాలికి అండ



వృద్ధురాలికి నగదు అందజేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

పామిడి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తీవ్ర అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వృద్ధురాలు బోయ సుశీలకు టీడీపీ మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ అండగా నిలిచారు. ఆదివారం ఆయన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పట్టణంలో పర్యటిస్తుండగా.. బోయ సుశీల పరిస్థితిని చూసి చలించిపోయారు. తను, తన భర్త బోయ శ్రీరాములు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని ఆమె వాపోయింది. దీంతో ఆమెకు పింఛన్ మంజూరు చేయిస్తానని, అంతవరకూ నెలకు రూ. రెండు వేలను తానే అందిస్తానని భరోసా ఇచ్చారు.

● పరామర్శ : అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న టీడీపీ నాయకుడు తిప్పారెడ్డిని గుమ్మనూరు ఈశ్వర్ పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, గిరిజన సహకార సంస్థ బోర్డు డైరెక్టర్ రమేష్‌నాయక్, పీ కొత్తపల్లి సహకార బ్యాంకు చైర్మన్ బొల్లు శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు జింకల సంజీవకుమార్, నాయకులు ఉన్నారు.

● సమస్యలు పరిష్కరిస్తాం : పామిడి పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలోని పలు వీధుల్లో ఆదివారం ఆయన పర్యటించారు. స్థానికులతో మాట్లాడుతూ సమస్యలపై ఆరా తీశారు.

వాహనాల తనిఖీ

పుట్లూరు, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు గ్రామశివారులో సీఐ సత్యబాబు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం అధికలోడుతో వెళుతున్న వాహనాలకు, లైసెన్స్ లేని వాహనదారులకు జరిమానా విధించారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు.

అఖండ-2 త్వరగా రిలీజ్ కావాలని పూజలు

గార్లదిన్నె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బాలకృష్ణ నటించిన అఖండ-2 సినిమా అన్ని అడ్డంకులు తొలగి త్వరగా రిలీజ్ కావాలని ఐ టీడీపీ అధికార ప్రతినిధి సాకే శివానంద కోరారు. ఈ మేరకు కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 108 శివలింగాలకు పాలభిషేకం చేశారు.